RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

తెలుగు దిన పత్రిక

hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 265 | శుక్రవారం, మార్చి 06 2026 | ఎడిటర్ : బట్టు లక్ష్మీనారాయణ, | పేజీలు : 6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram,Guntur,Nellor,Ongole,kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,

## గోదావరి పుష్కరాల కోసం తెలంగాణ
# కేబినెట్ సబ్ కమిటీ

**కమిటీ చైర్మన్‌గా మంత్రి శ్రీధర్ బాబు.. కన్వీనర్‌గా దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి**

**గోదావరి పుష్కరాల నిర్వహణపై 9 మందితో కూడిన కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు**

**2027 జూలై 23 నుంచి ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాలు**

**ప్రధాన ఆలయాలు, ఘాట్ల వద్ద శాశ్వత ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ ఆదేశం**

**కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు, ప్యాకేజీ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం**

**హైదరాబాద్,మార్చి5**
తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న గోదావరి పుష్కరాలకు (2027) ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు ప్రారంభించింది. 'దక్షిణ కుంభమేళా'గా పిలిచే ఈ



మహా క్రతువు నిర్వహణ, ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది మంది సభ్యులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చైర్మన్‌గా వ్యవహరిస్తారు.కమిటీ సభ్యులుగా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడమిగతా2లో...



## రెండు రాజ్యసభ స్థానాలకు
# కాంగ్రెస్ నామినేషన్

**అభిషేక్ సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్ పత్రాల దాఖలు**

సీఎం రేవంత్ రెడ్డికి సన్నిహితుడైన నరేందర్ రెడ్డికి దక్కిన అవకాశం

అసెంబ్లీలో కాంగ్రెస్‌కు పూర్తి బలం.. ఏకగ్రీవ ఎన్నిక లాంఛనమే

ఈ నెల 16న ఎన్నికలు.. నామినేషన్లకు నేడే చివరి రోజు



**హైదరాబాద్,మార్చి5**
తెలంగాణ నుంచి ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, సీఎం రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఇవాళ నామినేషన్లు దాఖలు చేశారు. శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు నాయకత్వంలో వీరు తెలంగాణ అసెంబ్లీలో రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డికి తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు హాజరయ్యారు.మిగతాది 2లో...



# ముగిసిన నితీశ్ శకం

**రాజ్యసభకు నామినేషన్ వేసిన నితీశ్ కుమార్**

**బీహార్ సీఎం పదవిని చేపట్టబోతున్న బీజేపీ!**

**సీఎం రేసులో సామ్రాట్ , నిత్యానంద , దిలీప్ జైశ్వాల్**

**పాట్నా :**
బీహార్ రాజకీయాల్లో సుదీర్ఘ కాలం పాటు ముఖ్యమంత్రిగా చక్రం తిప్పిన నితీశ్ కుమార్, రాష్ట్ర రాజకీయాల నుంచి తప్పుకుని జాతీయ రాజకీయాల వైపు అడుగులు వేయడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ఆయన త్వరలోనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నారు. మిగతా2లో...

## తెలంగాణలో
# భానుడి భగభగ...



**ములుగులో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు**

**పెరుగుతున్న పగటిపూట ఉష్ణోగ్రతలు**

**ఆదిలాబాద్, ఖమ్మం, జగిత్యాలలో అత్యధిక ఉష్ణోగ్రతలు**

**వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచన**

**హైదరాబాద్,మార్చి5**
తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగతో పగటిపూట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మార్చి మొదటి వారంలోనే ఎండలు తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయి. గురువారం ములుగు జిల్లా మంగపేటలోమిగతా2లో......

# మూసీ పేరుతో దోపిడీ

**బీఆర్ఎస్ హయాంలో ఐదున్నర కిలోమీటర్ల పొడవున సుందరీకరణ పనులు చేశామన్న కేటీఆర్**

**ప్రజల ఆస్తులకు నష్టం చేయకుండా అభివృద్ధి చేయవచ్చని నిరూపించామన్న కేటీఆర్**

**సుందరీకరణ పనులు తమకు అప్పగిస్తే రూ.16 వేల కోట్లకే చేసి చూపిస్తామని సవాల్**




**హైదరాబాద్,మార్చి5 :**
విధ్వంసం చేయకుండా, ఎవరి ఇళ్లు కూల్చకుండా కూడా అభివృద్ధి, సుందరీకరణ పనులు చేయవచ్చని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మిగతా2లో...

# తెలుగు రాష్ట్రాల్లో టెన్త్ పరీక్షలకు రెడీ

**తెలంగాణలో 14 నుంచి, ఎపిలో 16 నుంచి పరీక్షలు**

**వాట్సాప్ ద్వారా హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్‌కు అవకాశం**



**హైదరాబాద్,మార్చి5 :**
తెలుగు రాష్ట్రాల్లో పదో తరగతి పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు విడుదలయ్యాయి. తెలంగాణలో మార్చి14 నుంచి.. ఏపీలో16 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పరీక్షలకు ఇంకా కొన్ని రోజులు మాత్రమే గడువు ఉంది. దీంతో ఆయా రాష్ట్రాల ఎస్-ఎస్‌సీ బోర్డులు మిగతా2లో...

# చర్చలు, దౌత్యంతోనే సమస్యలకు పరిష్కారం

**ఫిన్లాండ్ అధ్యక్షుడు స్టబ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు**

**ఉగ్రవాద నిర్మూలనే ఇరువురి ఉమ్మడి లక్ష్యం అని ప్రకటన**

**వలసలు, మొబిలిటీపై భారత్, ఫిన్లాండ్ కీలక ఒప్పందం**

**విద్యా రంగంలో పరస్పర సహకారానికి నిర్ణయం**

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ మరోసారి శాంతి మంత్రం జపించింది. కేవలం సైనిక చర్యలతో ఏ సమస్యా పరిష్కారం కాదని, చర్చలు, దౌత్యమే సరైన మార్గమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గురువారం నాడు ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు.మిగతా2లో...



## కుటుంబ నియంత్రణ నుంచి
# జనాభా పెరుగదల లక్ష్యం

**దేశంలో తగ్గుతున్న ఫర్టిలిటీ రేటు**

**రాష్ట్రంలో ఏటా 6.70 లక్షల జననాలు నమోదు**


**2047 నాటికి జనాభాలో 23 శాతం మంది వృద్ధులు**

**ఫెర్టిలిటీ సమస్యలతో బాధపడేవారికి ప్రభుత్వం ప్రోత్సాహం**

**పాపులేషన్ పాలసీపై చర్చ జరగాలి**

**అసెంబ్లీలో డ్రాఫ్ట్ ప్రవేశ పెట్టిన సిఎం చంద్రబాబు**

**అమరావతి,మార్చి5 :**
జపాన్, దక్షిణ కొరియా, ఇటలీ లాంటి దేశాల్లో ఫెర్టిలిటీ రేట్ తగ్గుతోందని.. భారత్‌తో పాటు ఏపీ లాంటి రాష్ట్రాల్లోనూ ఈ తరహా పరిస్థితే నెలకొందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో టోటల్ ఫెర్టిలిటీ రేట్ 1.5గా ఉందని.. 1993లో ఇది 3.0గా నమోదైందని సీఎం వివరించారు. టీఎఫ్ఆర్ వేగంగా తగ్గితే పని చేసే వయస్సులో ఉన్నవారి సంఖ్య గణనీయంగా తగ్గి, ఆర్థిక వృద్ధి మందగిస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే ఆర్థిక వ్యవస్థకు నష్టం మిగతా2లో...



# నా... మాట!

విమర్శలు ప్రతి విమర్శలు ఒక్కప్పుడు రాజకీయాల్లోనే ఉండేవి..
కానీ ఇప్పుడు సభ్య సమాజంలో ప్రతి ఒక్కరు
విమర్శత్మాకంగానే మెదులుతున్నారు..
గత ప్రభుత్వాన్ని విమర్శించాలంటే వెన్నులో వణుకు పుట్టేది..
ఇప్పుడు భావస్వేచ్ఛా అందరిలో మొఖాల్లో కనిపిస్తుంది..
సాగుతున్నా కాలంలో,రాజకీయాల లోపాలను
ఎత్తిచూపుతున్నారు..
రాజ్యాంగం కల్పించిన హక్కులంటూ,
పదునైనా పౌరుష పదజాలంతో విరుచుకపడుతున్నారు..
సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించడం నేర్పుతున్నారు..
ప్రజలకు,ప్రభుత్వాలకు వారధిగా వ్యహరిస్తున్నారు..
నిజాలను నీక్కచ్చిగా మాట్లాడే వ్యక్తులు,
గోంతు చించుకుని గర్జిస్తున్నారు..
నాయకులు చేస్తున్నా అరాచకాలను ఎండగడుతున్నారు..
జర్నలిజం ఇప్పుడు,ఎప్పుడు ప్రజల పక్షమే ఉండాలని
కోరుకుందాం..

పెద్దపల్లి రాజన్న... Cell :9848174314

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

## తెలంగాణలో భానుడి భగభగ...

(మొదటి పేజీ తరువాయి)
అత్యధికంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్, ఖమ్మం, జగిత్యాలలో 38.9 డిగ్రీలు, మంచిర్యాలలో 38.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. వృద్ధులు, పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ములుగు, ఆదిలాబాద్, జగిత్యాల, ఖమ్మం, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, కుమురంభీమ్, నాగర్ కర్నూలు, నిజామాబాద్ తదితర జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్, సిద్దిపేట తదితర జిల్లాల్లో 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

# ముగిసిన నితీశ్ శకం



(మొదటి పేజీ తరువాయి)
ఈ నేపథ్యంలో, బీహార్ తదుపరి ముఖ్యమంత్రి ఎవరనే చర్చ పెద్ద ఎత్తున జరుగుతోంది.
ప్రస్తుత అంచనాల ప్రకారం, కొత్త ప్రభుత్వంలో బీజేపీ ముఖ్యమంత్రి పదవిని దక్కించుకోనుంది. ఈ రేసులో ప్రధానంగా ముగ్గురు నేతల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వారు ఎవరంటే...?
సామ్రాట్ చౌదరి: ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సామ్రాట్ చౌదరి సీఎం రేసులో అందరికంటే ముందున్నారు. ఓబీసీ (కుష్వాహా) సామాజికవర్గానికి చెందిన ఆయనకు పార్టీలో, ప్రభుత్వంలో పట్టు ఉండటం ప్లస్ పాయింట్.నిత్యానంద రాయ్: కేంద్ర మంత్రిగా ఉన్న నిత్యానంద రాయ్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. యాదవ సామాజికవర్గానికి చెందిన ఈయనను సీఎంగా చేయడం ద్వారా, ఆర్జేడీ (తేజస్వి యాదవ్) ఓటు బ్యాంకుకు గండి కొట్టాలని బీజేపీ భావిస్తోంది. అమిత్ షాతో నిత్యానంద రాయ్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి.దిలీప్ జైశ్వాల్: బీహార్ మంత్రి దిలీప్ జైశ్వాల్ పేరు కూడా పరిశీలనలో ఉంది. వైశ్య సామాజికవర్గానికి చెందిన ఈయనకు పార్టీ అధిష్ఠానం వద్ద మంచి గుర్తింపు ఉంది.

## తెలుగు రాష్ట్రాల్లో టెన్త్ పరీక్షలకు రెడీ

(మొదటి పేజీ తరువాయి)
పరీక్షల హాల్‌టికెట్లను గురువారం విడుదల చేశాయి. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థుల హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లలో వేర్వేరుగా అందుబాటులో అధికారులు ఉంచారు. తెలంగాణలో విద్యార్థులు తమ హాల్‌టికెట్లను బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్ , ఏపీ విద్యార్థులు వాట్సాప్‌లో హాల్ టికెట్లు పొందవచ్చు. ఇక ఏపీ విద్యార్థులు మనమిత్ర (వాట్సాప్ నంబర్ 9552300009) లేదా లీప్ యాప్ ద్వారా.. అలాగే తెలంగాణ విద్యార్థులు వాట్సప్ నంబర్ (8096958096) ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలా కుదరకుంటే.. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వద్ద నుంచి కూడా ఈ పరీక్ష హాల్ టికెట్లను విద్యార్థులు పొందవచ్చు. తెలంగాణ అభ్యర్థులు 8096958096 వాట్సప్ నంబర్‌కు హాయ్ అని సందేశం చేయగానే మీ ఫోన్‌కి వెల్‌కమ్‌టూ మీ సేవ అని వస్తుంది. చాట్‌లో టైప్ చేసి మెసేజ్ చేయండి. మీ మొబైల్‌కు ఒక లింక్ వస్తుంది. ఆ లింక్‌ను ఓపెన్ చేసి జిల్లా, పాఠశాల పేరును ఎంచుకోండి.
విద్యార్థి పేరు, పుట్టిన తేదీ నమోదు చేస్తే హాల్‌టికెట్ మీ ఫోన్‌లోనే వస్తుంది. ఈ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసి భద్రపరుచుకోండి. ఏపీలో వాట్సప్‌లో డౌన్‌లోడ్ ఇలా.. మీ ఫోన్‌లో 552300009 నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపాలి. సర్వీస్ సెలక్షన్ అనే ఆప్షన్ వస్తుంది. ఎడ్యుకేషన్ సర్వీసెస్‌ను ఎంచుకోండి.అక్కడ ఎస్ఎస్సీ హాల్‌టికెట్ అనే ఆప్షన్‌ను సెలక్ట్ చేసుకోవాలి. అప్లికేషన్ నంబర్/ చైల్డ్ ఐడీతోపాటు పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేయాలి. రెగ్యులర్/ప్రైవేట్/ ఓఎస్ఎస్-సీ రెగ్యులర్/ఒకేషనల్‌లలో మీకు సంబంధించిన కేటగిరీని ఎంచుకొని కన్‌ఫర్మ్ చేయాలి. ఆ తర్వాత కొన్ని నిమిషాలకు హాల్‌టికెట్ మీ వాట్సప్ నంబర్‌కే వస్తుంది. ఈ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసి భద్రపరుచుకోవాలని సూచించారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ

(మొదటి పేజీ తరువాయి)
మరో ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ పూర్తి కాలేదు. ఆయన విచారణను శనివారానికి అంటే.. మార్చి 7వ తేదీకి వాయిదా వేశారు. ఈ కేసులో శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణకు హాజరు కావాలని ఇరు వర్గాలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ రావు సూచించారు. దీంతో ఈ పిటిషన్లను స్పీకర్ శనివారం విచారించనున్నారు. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొన్న పలువురి ఎమ్మెల్యేల విచారణ ఇప్పటికే పూర్తయింది. వారందరికి స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్ చీట్ ఇచ్చిన విషయం విదితమే. ఈ కేసులో ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను విచారించాల్సి ఉంది. ఆయన విచారణ కూడా పూర్తయితే.. ఈ ఫిరాయింపుల వ్యవహారం ఒక కొలిక్కి వస్తుంది.


## లిక్కర్ కేసు కొట్టేయడంతో స్వామికి మొక్కు

### తిరుమలకు కాలినడకన చేరుకున్న కవిత

### త్వరలోనే రాజకీయ పార్టీ ఏర్పాటు

### తెలంగాణ ఫస్ట్ నినాదంతో ముందుకు వెళతామని ప్రకటన

**తిరుపతి,మార్చి5:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తిరుమలకు కాలినడకన వెళ్లి శ్రీవారిని దర్శనం చేసుకునేందుకు తిరుపతి చేరుకున్నారు. తిరుపతిలోని అలిపిరి వద్ద నుంచి కాలినడకన తిరుమల బయల్దేరిన ఆమె.. ముందుగా మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.. గత నాలుగేళ్లుగా చేయని తప్పుకు తాను మానసిక వేదన అనుభవించానని కవిత తెలిపారు. అయితే దేవుడి దయతో తనపై ఉన్న కేసును కోర్టు పూర్తిగా కొట్టివేసిందని చెప్పారు. ఆ కేసు నుంచి విముక్తి లభిస్తే కాలినడకన తిరుమలకు వచ్చి స్వామివారిని దర్శించుకుంటానని మొక్కుకున్నానని, ఆ మొక్కును తీర్చుకోవడానికి ఇప్పుడు తిరుమలకు వచ్చానని వెల్లడించారు. అదే సమయంలో తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రకటన చేశారు. మరో రెండు నెలల్లో తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈ పార్టీని స్థాపించనున్నట్లు చెప్పారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా ప్రజలకు సేవ చేసే పార్టీగా దీనిని తీర్చిదిద్దుతామని కవిత తెలిపారు. తెలంగాణ ఫస్ట్ అనే నినాదంతో ప్రజల సమస్యలను మైక్రో లెవెల్‌లో పరిష్కరించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్రను బీఆర్ఎస్ సరిగా నిర్వహించలేకపోయాయని ఆమె విమర్శించారు. మరోవైపు.. ఆంధ్రప్రదేశ్ ప్రజలపై తమకు ఎలాంటి ద్వేషం లేదని, రాజకీయ ఆధిపత్యాన్ని మాత్రమే వ్యతిరేకించామని కవిత స్పష్టం చేశారు. అలాగే హైడ్రా చర్యలపై కూడా ఆమె విమర్శలు గుప్పించారు. హైడ్రా పేదలను ఇబ్బంది పెట్టి పెద్దల కోసం పనిచేస్తోందని ఆరోపించారు. తాను ఎప్పుడూ పేదల పక్షాన నిలబడి పోరాడతానని కవిత అన్నారు. అలాగే తనకు న్యాయం చేసిన న్యాయవ్యవస్థకు కృతజ్ఞతలు తెలిపారు.



---

# చర్చలు, దౌత్యంతోనే సమస్యలకు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)
ఈ సందర్భంగా పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో నెలకొన్న ఘర్షణలను ముగించేందుకు జరిగే ప్రతి ప్రయత్నానికి భారత్ మద్దతు ఇస్తుందని మోదీ హామీ ఇచ్చారు. చట్టం, న్యాయం, ప్రజాస్వామ్య విలువలపై భారత్, ఫిన్లాండ్‌లకు ఒకే రకమైన అభిప్రాయం ఉందని ఆయన తెలిపారు.
ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమని ఇరువురు నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ నిర్మూలించడమే తమ ఉమ్మడి లక్ష్యమని మోదీ పేర్కొన్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ 'ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్' పూర్తి చేయడాన్ని ప్రస్తావిస్తూ మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మీరు ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్ పూర్తి చేశారు.. మీలాంటి శక్తివంతమైన నాయకత్వంతో భారత్, ఫిన్లాండ్ కూడా ఇన్నోవేషన్, డిజిటల్, సస్టైనబిలిటీ అనే కొత్త 'ట్రయాథ్లాన్'ను సాధిస్తాయని నాకు నమ్మకం ఉంది" అని మోదీ చమత్కరించారు.

**కొత్త శకంలో భారత్-యూరప్ బంధం**

ప్రస్తుతం ప్రపంచం అస్థిరత, అనిశ్చితి మధ్య ఉందని, ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచంలోని రెండు పెద్ద దౌత్య శక్తులైన భారత్, యూరప్ మధ్య సంబంధాలు స్వర్ణయుగంలోకి ప్రవేశిస్తున్నాయని ఆయన అభివర్ణించారు. 2026 ప్రారంభంలో కుదిరిన చారిత్రాత్మక 'ఇండియా-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' గురించి ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఒప్పందం ద్వారా భారత్, ఫిన్లాండ్ మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక సహకారం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**కీలక ఒప్పందాలపై సంతకాలు**

ఇరు దేశాల మధ్య ఆవిష్కరణల వ్యవస్థను అనుసంధానించేందుకు సమగ్ర 'మైగ్రేషన్ అండ్ మొబిలిటీ' (వలసలు మరియు రాకపోకల) ఒప్పందంపై సంతకాలు చేసినట్లు ప్రధాని ప్రకటించారు. భారతీయ విద్యార్థులకు, ప్రతిభావంతులకు ఫిన్లాండ్ ఇప్పుడు ఒక ప్రాధాన్య గమ్యస్థానంగా మారుతోందన్నారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల మధ్య పరిశోధనలు, స్టార్టప్ సహకారం మరింత బలపడుతుందని తెలిపారు. విద్యా రంగంలో ఫిన్లాండ్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడిన మోదీ.. ఉపాధ్యాయ శిక్షణ, స్కూల్-టు-స్కూల్ భాగస్వామ్యం, భవిష్యత్ విద్యా విధానాలపై సహకారాన్ని విస్తరించుకోవడానికి అంగీకరించినట్లు వెల్లడించారు. నార్డిక్ ప్రాంతంలో ఫిన్లాండ్ భారత్‌కు ముఖ్యమైన భాగస్వామి అని, ఆర్కిటిక్, ధృవ ప్రాంతాల పరిశోధనల్లోనూ తమ సహకారం కొనసాగుతుందని మోదీ స్పష్టం చేశారు.

# రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ నామినేషన్

(మొదటి పేజీ తరువాయి)
అంతకుముందు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఈ ఇద్దరి పేర్లను అధికారికంగా ప్రకటించింది. జాతీయ స్థాయిలో పార్టీకి న్యాయపరమైన అంశాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీకి కాంగ్రెస్ అధిష్ఠానం మరోసారి అవకాశం కల్పించింది. ఆయన వాగ్ధాటి, పార్లమెంటులో చురుకైన పాత్ర పార్టీకి ఆస్తిగా భావిస్తోంది. ఇక, రెండో అభ్యర్థిగా పలువురు సీనియర్ నేతల పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికీ, అధిష్ఠానం మాత్రం సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, ఆయన సలహాదారుగా ఉన్న వేం నరేందర్ రెడ్డి వైపు మొగ్గు చూపింది.
ప్రస్తుతం సిట్టింగ్ సభ్యులుగా ఉన్న అభిషేక్ మను సింఘ్వీ, కేఆర్ సురేశ్ రెడ్డిల పదవీకాలం ఏప్రిల్ 9తో ముగియనుండటంతో ఈ ఎన్నికలు అనివార్యమయ్యాయి. 2024లో కాంగ్రెస్‌లో చేరిన కె. కేశవరావు రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి సింఘ్వీ ఎన్నికైన విషయం తెలిసిందే. ఇక, కేఆర్ సురేశ్ రెడ్డి ప్రస్తుతం బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతగా ఉన్నారు.
ఈ నెల 16న రాజ్యసభ ఎన్నికల పోలింగ్ జరగనుండగా, నామినేషన్ల దాఖలుకు ఇవాళే చివరి రోజు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపకపోవడంతో కాంగ్రెస్ అభ్యర్థులు ఇద్దరూ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. 119 మంది సభ్యులున్న తెలంగాణ అసెంబ్లీలో రెండు స్థానాలను గెలుచుకోవడానికి అవసరమైన సంఖ్యాబలం అధికార కాంగ్రెస్ పార్టీకి ఉంది. కాంగ్రెస్‌కు 66 మంది ఎమ్మెల్యేలు ఉండగా, మిత్రపక్షం సీపీఐకి ఒక సభ్యుడు ఉన్నారు. కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా భావించే ఎంఐఎంకు ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. మరోవైపు బీఆర్ఎస్‌కు అధికారికంగా 37 మంది సభ్యులు ఉన్నప్పటికీ, వారిలో దాదాపు 10 మంది 2024లోనే కాంగ్రెస్‌కు మద్దతు పలికారు. బీజేపీకి 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ సంఖ్యాబలం దృష్ట్యా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు లాంఛనప్రాయమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# గోదావరి పుష్కరాల కోసం తెలంగాణ కేబినెట్ సబ్ కమిటీ

(మొదటి పేజీ తరువాయి)
, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పి.సుదర్శన్ రెడ్డిలను నియమించారు. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అవసరాన్ని బట్టి గోదావరి తీర ప్రాంతాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ప్రత్యేక ఆహ్వానితులుగా సమావేశాలకు పిలవనున్నారు. త్వరలోనే కమిటీ సమావేశమై సిఫార్సులను అందజేయనుంది.
2027 జూలై 23న గోదావరి పుష్కరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈసారి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ కోరాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో సుమారు 560 కిలోమీటర్ల మేర గోదావరి ప్రవహిస్తుండటంతో దాదాపు 74 ఘాట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ముఖ్యంగా బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలం ఆలయాల వద్ద రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో అక్కడ ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు.
పుష్కరాల ఏర్పాట్లు తాత్కాలికంగా కాకుండా, శాశ్వత ప్రాతిపదికన ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఆలయాల అభివృద్ధి, పర్మనెంట్ పుష్కర ఘాట్లు, రోడ్లు, వసతి సముదాయాలు నిర్మించాలని ఆదేశించారు. రోజుకు రెండు లక్షల మంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా ట్రాఫిక్, పార్కింగ్, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# మూసీ పేరుతో కాంగ్రెస్ దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)
. బీఆర్ఎస్ పాలనలో వికాసం, కాంగ్రెస్ పాలనలో విధ్వంసం కొనసాగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క ఇటుకను పేర్చనోడికి కూల్చే హక్కులేదని మండిపడ్డారు. నాగోల్ మూసీ పరీవాహక ప్రాంతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సుందరీకరణ పనులను గురువారం బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాడు మూసీలోని మురుగు నీరుని శుద్ధి చేయాలని బీఆర్ఎస్ ముందుకెళ్లింది. దేశంలోనే అతిపెద్దది అయిన నాగోల్ ఎస్టీపీని రూ. 4వేలకోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇండ్లు కూల్చకుండా, భూములు కోల్పోకుండా మూసీని అభివృద్ధి చేశామన్నారు. 2023 డిసెంబర్ వరకు 85 శాతం ఎప్టీపీ నిర్మాణం పూర్తయింది. 15 బ్రిడ్జీలు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది. మిగతా పెండింగ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బంగారుపల్లెంలో పెట్టి కేసీఆర్ తెలంగాణను అప్పగించారు. కాంగ్రెస్ స్వార్థం కోసం రూ. 16 వేల కోట్ల అయ్యే ప్రాజెక్ట్ వ్యయం పది రెట్లు పెంచి 1.50లక్షల కోట్ల భారీ స్కాంకు తెరతీశారని ఆరోపించారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకం సృష్టిస్తున్నది. రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి ఇల్లు ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఉంది అది కూలగొట్టే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. ప్రజలను రోడ్డున పడేసి ఏం సాధిస్తారన్నారు. సీఎం రేవంత్, మంత్రులు ఇలా అందరి ఇళ్లు బఫర్ జోన్‌లో ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో దివ్యాంగులు ఇళ్లు కూల్చారు.



ఖమ్మంలో పేదల గుడిసెలను బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. ఇవన్నీ రాహుల్ గాంధీకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలను బయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్‌కు రూ.16 వేల కోట్లతో మూసీని సుందరీకరించడం చేతకాకపోతే మేము చేసి చూపిస్తామని సవాల్ విసిరారు. రాష్ట్రంలో హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు హద్దే లేదని కేటీఆర్ విమర్శించారు. పేదల ఇళ్లు కూల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ పనులు చేస్తామని సీఎం రేవంత్ చెబుతున్నారు. రూ.16వేల కోట్లతోనే ఆ పనులను చేయొచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించింది హామీల అమలు కోసమేనని గుర్తు చేశారు. రెండున్నరేళ్లలో ఒక్క ఇల్లు నిర్మించినట్లు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటా. మూసీ సుందరీకరణ పనుల బాధ్యత మాకు అప్పగిస్తే రూ.16వేల కోట్లకే చేసి చూపిస్తాం. ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి చేస్తాం అని కేటీఆర్ అన్నారు. కెటిఆర్ వెంట మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తదితరులు ఉన్నారు.

# కుటుంబ నియంత్రణ నుంచి జనాభా పెరుగదల లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)
వాటిల్లే అవకాశం ఉందని చెప్పారు. ఏపీ శాసనసభలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఏపీకి అత్యంత కీలకమైన పాలసీని శాసనసభలో ప్రకటించారు. ఇప్పటి వరకు ఫ్యామిలీ ప్లానింగ్‌కు ప్రాధాన్యం ఇచ్చామని.. ఇకపై పాపులేషన్ కేర్ వైపు దృష్టి సారించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం డ్రాఫ్ట్ పాలసీని శాసనసభలో ప్రవేశపెట్టి ప్రజల ముందు ఉంచుతున్నామని వివరించారు. దీనిపై నెలరోజుల పాటు విస్తృత చర్చ జరగాలని కోరుతున్నామని సీఎం తెలిపారు. 2023 లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏటా 6.70 లక్షల జననాలు నమోదవుతున్నాయని తెలిపారు. ఇలాగే కొనసాగితే 2047 నాటికి జనాభాలో 23 శాతం మంది వృద్ధులు ఉంటారని అన్నారు. మహిళల లేబర్ ఫోర్సు పార్టిసిపేషన్ రేట్ ప్రస్తుతం 31 శాతంగానే ఉంటుందని.. ఇది 59 శాతానికి చేరితే రాష్ట్ర జీఎస్‌డీపీ 15 శాతం పెరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. పాపులేషన్ మేనేజ్‌మెంట్ కోసం ఐదు అంచెల లైఫ్ సైకిల్ విధానాన్ని అమలు చేయాల్సి ఉందన్నారు. మాతృత్వం, శక్తి, క్షేమం, నైపుణ్యం, సంజీవని లాంటివి ఐదు పిల్లర్లుగా పనిచేస్తాయన్నారు. మహిళల గర్భధారణ నుంచి వృద్ధాప్యం వరకు ప్రతి దశలో ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. పిల్లలు లేక ఫెర్టిలిటీ సమస్యలతో బాధపడేవారిని ప్రభుత్వం ఆదుకుంటుందని.. మాతృత్వ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేసి, సబ్సిడీపై పీపీపీ మోడల్‌లో ఐవీఎఫ్(ఎ÷ఎఈ) సేవలు అందించాలని యోచిస్తున్నామని అన్నారు. సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించడం ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ప్రస్తుతం 8.8 శాతంగా ఉన్న టీనేజి గర్భధారణలను 3 శాతం కంటే తక్కువకు తగ్గించే చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. 10 మంది చిన్నారులు ఉన్న చోట చైల్డ్ కేర్ సెంటర్లు, పింక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు సీఎం తెలిపారు. మహిళల రక్షణ కోసం షీ క్యాబ్స్ అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నామన్నారు. విశాఖపట్నంలో రూ.172 కోట్లతో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. మహిళా ఉద్యోగులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాల్లో కొత్త వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. మూడో సంతానం, ఆపై జననాలకు తల్లులకు 12 నెలల పేరెంటల్ లీవ్, తండ్రులకు 2 నెలల పెటర్నల్ లీవ్ ఇవ్వాలని ఆలోచిస్తున్నామని అన్నారు. త్వరలో 'తల్లిదండ్రుల సమాన బాధ్యత' పేరుతో కుటుంబ బాధ్యతలు పంచుకోవడంపై అవగాహన క్యాంపెయిన్ నిర్వహిస్తామని సీఎం తెలిపారు. 2047 నాటికి ఏపీలో వృద్ధుల జనాభా 23 శాతం ఉంటుందని అంచనా వేస్తూ, ప్రతి జిల్లాలో వృద్ధుల సంరక్షణకు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు సీఎం. 175 సీహెచ్‌సీలలో రెండు వారాలకు ఒకసారి ప్రత్యేక క్లినిక్ నిర్వహిస్తామని తెలిపారు. సిల్వర్ స్కిల్స్ రిజిస్ట్రీ ద్వారా 50,000 రిటైర్డ్ ప్రొఫెషనల్స్‌ను మెంటరింగ్‌లో భాగం చేస్తామన్నారు. రిటైర్మెంట్‌కు ముందే ఉద్యోగులకు 15 రోజుల వెల్‌నెస్ లీవ్, రూ.50,000 ఆరోగ్య నిధి అందిస్తామని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

తెలుగు దిన పత్రిక

## విద్యార్థులే.. ఉపాధ్యాయులైన వేల




**హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి) :-**
మండల పరిధిలోని సెయింట్ పీటర్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా ఉండి తోటి విద్యార్థులకు విద్యాబోధన నేర్పించడం జరిగినది. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ రోసి మేరీ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదిగా భావిస్తూ విద్యార్థులు ఉపాధ్యాయులు వృత్తిలో ఎంతో నైపుణ్యత కలిగిన వృత్తి కాబట్టి ప్రతి ఒక్కరు తోటి విద్యార్థులను విద్యాబుద్ధులు నేర్పించి ప్రథమ పౌరులుగా తీర్చిదిద్దాలని వారన్నారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఎంతో చాకచక్యంగా తయారై తోటి విద్యార్థులకు తమ అనుభవాలను పంచటం చాలా సంతోషంగా ఉందని విద్యార్థులు అనడం జరిగినది . ఈ కార్యక్రమంలో వివిధ అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులతో పాటు వివిధ వేషధారణలతో స్వయం పరిపాల దినోత్సవం జరుపుకోవడం జరిగినదని కరస్పాండెంట్ మలయాప్పన్ రాజా తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సైదమ్మ, సరిత, మణమ్మ,రవీందర్ మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు




**హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల( ప్రతినిధి)** మండల కేంద్రంలోని ముకుందాపురము వద్ద ఉదయం 08 గంటలకు ముకుందపురము పాలేరు వాగు నుండి మద్దిరాల కు బూదరపు ఉపేందర్ అనే వ్యక్తి తన యొక్క ట్రాక్టర్ లో అక్రమంగా ఇసుక తీసుకొస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేయడమైనది స్థానిక ఎస్సై ఎం వీరన్న తెలిపారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా ప్రభుత్వం అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్ట పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మండల ప్రజలకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు బృందం తదితరులు పాల్గొన్నారు.

## నక్కగుట్ట తండ గ్రామ పరిధిలో వృద్ధుడు అనుమానాస్పద మృతి



**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 5:-** నాగర్ హైవే సమీపంలోని నక్క గుట్ట తండా గ్రామ పరిధిలో 60–65 సంవత్సరాల వయస్సు గల ఓ వృద్ధుడు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు, గ్రామ పరిధిలో గుర్తుతెలియని వాహనం డీకొట్టడం వల్ల గాయాలతో పడి ఉన్న వృద్ధుడిని గుర్తించారు. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, డయల్ 100 సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితులను పరిశీలించి వృద్ధుడు మరణించినట్లు తెలుసుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి శరీరంపై ఎరుపు రంగు టీ–షర్ట్, చెక్స్ షర్ట్, బ్లాక్ కలర్ ప్యాంట్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.మృతుడి గుర్తింపు ఇంకా తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## గుంటూరు పశ్చిమ టిడిపి క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడుగా జొన్నలగడ్డ ఉదయభాను నియామకం పట్ల పలువురు హర్షం...



**హైదరాబాద్ స్టేట్ న్యూస్ ప్రతినిధి అమరావతి** గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించిన తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగాలను పశ్చిమ శాసన సభ్యురాలు గల్లా మాధవి ప్రకటించారు. వీటిలో ఒకటైన క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడిగా 49వ డివిజన్ కు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు జొన్నలగడ్డ ఉదయభాను (చింటు) ను నియమించటం జరిగింది. ఈ ప్రాంతం గతంలో గుంటూరు ఒకటో నియోజకవర్గం పరిధిలోకి ఉండేటిది. అప్పట్లో ఉదయభాను నగర,నియోజ కవర తెలుగు విద్యార్థి విభాగం మరియు తెలుగు యువతలో కార్యదర్శిగా ఉపాధ్యక్షుడుగా పనిచేయడం జరిగిందనీ, మంచి వ్యక్తికి ఉపవాస దీక్షలలో పదవి ఇవ్వడం, తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసిన క్రిస్టియన్ సెల్ లో ఉదయభానుని నియమించడం పట్ల నియోజకవర్గంలోని చర్చి పాస్టర్లు, చర్చి ఫాదర్లు మరియు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ దళిత క్రిస్టియన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కర్ర హోనక్ బెంజిమెన్ హర్షం వ్యక్తం చేశారు. ఫాదర్లు, పాస్టర్లతో సన్నిహిత సంబంధాలతో వారికి చేదోడు వాదోడుగా ఉంటాడని, పేద క్రిస్టియన్ వర్గాల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే కార్యక్రమాలు చేయాలని టిడిపి సీనియర్ రాష్ట్ర నాయకుడు సిరిపురపు శ్రీధర్ మరియు యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ అధ్యక్షులు కె.జోసఫ్ ఆశాభావంతో వ్యక్తం చేశారు. ఈ పదవి నియామాకానికి సహకరించిన శాసనసభ్యురాలు గల్లా మాధవికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం వెంటనే చెల్లించాలి

**- డాక్టర్ పిట్ట వరప్రసాద్**

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి కాకినాడ**
వేట్లపాలెం ఫైర్ వర్క్స్ అగ్ని ప్రమాద మృతుల కుటుంబాలకు పూర్తి పరిహారం తక్షణమే ఇవ్వాలిరిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు డా. పిట్టా వరప్రసాద్ డిమాండ్కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలోని సూర్య శ్రీ ఫైర్ వర్క్స్ లో జరిగిన భయంకర అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం మొత్తాన్ని తక్షణమే అందించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు డా. పిట్టా వరప్రసాద్ డిమాండ్ చేశారు.ఈ ప్రమాదంలో ప్రారంభంలో మృతి చెందిన 20 మంది కుటుంబాలకు ప్రభుత్వం ఒక్కొక్కరికీ 20 లక్షల రూపాయల చొప్పున చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అయితే తీవ్రంగా గాయపడిన పలువురిని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స కోసం చేర్చగా, చికిత్స పొందుతూ ఈరోజు (05-03-2026) వరకు మరో 7 మంది మృతి చెందడం అత్యంత దురదృష్టకరమైన విషయం అని ఆయన పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో తాజాగా మృతి చెందిన ఆ 7 మంది బాధితుల కుటుంబాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 20 లక్షల రూపాయల పరిహారాన్ని తక్షణమే అందించాలి అని డిమాండ్ చేశారు.అలాగే ఈ ప్రమాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఒక్కొక్కరికి 2 లక్షల రూపాయల ఆర్థిక సహాయం ఇప్పటివరకు ఏ ఒక్క బాధిత కుటుంబానికి కూడా అందలేదని తెలిపారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని కూడా ఆలస్యం చేయకుండా తక్షణమే విడుదల చేసి బాధిత కుటుంబాలకు అందించాలన్నారు.అదేవిధంగా, ఈ ప్రమాదం జరిగిన వెంటనే రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు డా. పిట్టా వరప్రసాద్ మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల పరిహారం మరియు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే అని తెలిపారు. అయితే ప్రభుత్వం ప్రస్తుతం 20 లక్షల రూపాయల పరిహారం మాత్రమే ప్రకటించి చెక్కుల రూపంలో 20 కుటుంబాలకు అందజేసిందని, తాజాగా మృతి చెందిన మిగిలిన 7 కుటుంబాలకు కూడా వెంటనే 20 లక్షల రూపాయల చెక్కులు అందజేయాలని కోరారు.అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల రూపాయల నగదు సహాయం ఇప్పటికీ బాధిత కుటుంబాలకు అందలేదని, ఆ సహాయాన్ని కూడా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ దారుణ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక, మానసిక కష్టాల్లో ఉన్నందున రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మానవత్వంతో స్పందించి పూర్తి పరిహారం త్వరితగతిన అందించాల్సిన బాధ్యత ఉందని డా. పిట్టా వరప్రసాద్ పేర్కొన్నారు

## రైతులు పండించిన ధాన్యానికి సకాలంలో డబ్బులు చెల్లించాలి

**- బిఆర్ఎస్ పార్టీ సెక్రటరీ, మహేశ్వరం నియోజకవర్గం: సామ మహేందర్ రెడ్డి..**



**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 5:-**
మహేశ్వరం నియోజకవర్గంలోని రైతులు పండించిన మొక్కజొన్నకు సంబంధించిన డబ్బులు ఇప్పటికీ చెల్లించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి స్పష్టమైన నిదర్శనం. తమకు రావాల్సిన డబ్బుల కోసం రైతులు ధర్నా చేపట్టి ఇప్పటికే పది రోజులు పూర్తయినా కూడా ప్రభుత్వం స్పందించకపోవడం తీవ్రంగా ఖండించాల్సిన విషయం. ఎన్నికల సమయంలో రైతుల సంక్షేమం గురించి పెద్ద పెద్ద హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు రైతుల కష్టాలను ఎందుకు పట్టించుకోవడం లేదు?పగలు రాత్రి కష్టపడి పంట పండించిన రైతులు తమ కష్టార్జిత డబ్బుల కోసం రోడ్లపై ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం ఈ ప్రభుత్వానికి సిగ్గుచేటు. అలాగే పేద కుటుంబాల కోసం ఎంతో కీలకమైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులు కూడా ఇప్పటివరకు లబ్ధిదారులకు అందకపోవడం బాధాకరం. ఈ విషయంపై 2026 ఫిబ్రవరి 21న కందుకూరు మండలంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. ఆ సమయంలో ఆర్డీవో వారం రోజుల్లో చెక్కులు అందజేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు లబ్ధిదారులకు చెక్కులు అందలేదు. పేదల పెళ్లిళ్ల కోసం ప్రభుత్వం ప్రకటించిన పథకాలు కూడా అమలు కాకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. వెంటనే మహేశ్వరం నియోజకవర్గంలోని రైతులకు మొక్కజొన్న బకాయిలు చెల్లించాలి. అలాగే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేస్తున్నాము. లేదంటే మహేశ్వరం నియోజకవర్గ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాము. అని సామ మహేందర్ రెడ్డి విలేకరుల సమావేశంలో తెలియజేశారు.

## రాజ్యసభ సీట్లలో మాదిగ జాతికి కాంగ్రెస్ పార్టీ నమ్మక ద్రోహం.

**- రేవంత్ రెడ్డి హయాంలోనె మాదిగలకు అత్యంత మోసం. మందకృష్ణ మాదిగ**

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి హైదరాబాద్**
రాజ్యసభ సీట్ల కేటాయింపులో తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక జనాభా గల మాదిగలకి కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా ఇవ్వకుండా రేవంత్ రెడ్డి మాదిగ జాతికి నమ్మకద్రోహం చేశాడని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ గారు ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయాంలో మాదిగ జాతికి మరింత అన్యాయం జరుగుతుందని గత కాంగ్రెస్ హయాంలో జరగనంత తీవ్ర అన్యాయం రేవంత్ రెడ్డి హయాంలోనె జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.మూడు ఎస్సీ రిజర్వ్ డ్ లోక్ సభ స్థానాలు ఉన్న తెలంగాణలో ఒకటి కూడా మాదిగలకు కేటాయించకుండా అన్యాయం చేశాడని, ఈ మధ్యకాలంలో ఐదు ఎమ్మెల్సీలు భర్తీ చేస్తే ఎస్సీలలోని మాల సామాజిక వర్గానికి ఇచ్చి ఎస్టీలకు ఒకటి ఇచ్చి మాదిగలకు మాత్రం ఒక్కటి కూడా ఇవ్వలేదని అన్నాడు. ఇప్పుడు రాజ్యసభ సీట్లలో ఇవ్వకుండా మాదిగ జాతికి ద్రోహం చేశాడని మండిపడ్డారు.
ఇప్పటికే క్యాబినెట్ హోదా కలిగి ముఖ్యమంత్రి తర్వాత షాడో ముఖ్యమంత్రిగా ఉన్న మిత్రుడైన తన కులమైన వేం నరేందర్ రెడ్డి కి రేవంత్ రెడ్డి రాజ్యసభ ఇచ్చిండు కానీ తనను నమ్ముకొని ఉన్న కాంగ్రెస్ పార్టీలో సీనియర్ మాదిగ వ్యక్తులకు ఇవ్వకుండా నమ్మకద్రోహానికి పాల్పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు.
సుప్రీంకోర్టు జడ్జిమెంట్ తో తెలంగాణ రాష్ట్రంలో అమలులోకి వచ్చిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ప్రక్రియలో 15 లక్షల జనాభా ఉన్న మాలలకు ఐదు శాతం కేటాయించినప్పుడు 33 లక్షలన్న మాదిగలకు 11 శాతం కేటాయించకుండా తొమ్మిది శాతమే ఇచ్చి అన్యాయం చేశారని, అదేవిధంగా గత నోటిఫికేషన్లకు వర్గీకరణ అమలు చేస్తానని నిండు అసెంబ్లీలో మాట ఇచ్చి వర్గీకరణ అమలు చేయకుండా టీచర్ పోస్టుల భర్తీ నియామక పత్రాలు ఇచ్చి, గ్రూప్ వన్, గ్రూప్ టు,గ్రూప్ త్రీ సంబంధించిన పోస్టులలో వర్గీకరణ లేకుండా భర్తీ చేసి వేలాదిమంది మాదిగ నిరుద్యోగులకన్యాయం చేశాడని అన్నారు. పార్లమెంట్లో మాదిగలకు ప్రాతినిధ్యం లేని సందర్భం ఈ రేవంత్ రెడ్డి హాయంలోనేనని ఏ ప్రభుత్వాలలో కూడా ఇంత అన్యాయం జరగలేదని అన్నారు. కర్ల రాజేష్ ఘటనలో గత 110 రోజులుగా ఉద్యమిస్తుంటే హోం శాఖను తన వద్దే ఉంచుకున్న రేవంత్ రెడ్డి ఇప్పటివరకు కర్ల రాజేష్ ఘటనపై స్పందించలేదని, రాజేష్ ఘటనలో నిందితుడైన ఎస్ఐ సురేష్ రెడ్డిని కాపాడుతున్నారని అన్నారు.మరియమ్మ లాకప్ డెత్ విషయంలో పది రోజుల్లోనే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు స్పందించి పోలీసులను డిస్మిస్ చేసి ఆ కుటుంబానికి 35 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించి న్యాయం చేశారని, కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కర్ల రాజేష్ లాకప్ డెత్ విషయంలో 110 రోజులైనా కూడా ఇంకా ముఖ్యమంత్రి స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.
ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన పోలీసులు, పోలీస్ అధికారులు ప్రభుత్వ పాలకుల మాట విని వారి కనుగుణంగా ప్రజలను చిత్రహింసలు పెట్టరాదని, ఇల్లీగల్ కస్టడీలోకి తీసుకోరాదని మీ డ్యూటీలను సక్రమంగా నిర్వర్తించాలని సూచన చేశారు. అగ్రకుల పాలకుల మాటలు విని వారి ఆదేశాలను పాటిస్తే మీకు ఇబ్బంది వచ్చినప్పుడు మిమ్మల్ని కాపాడారని మిమ్మల్ని బలి పశువులను చేస్తారని అన్నారు.
రాజ్యసభ సీట్లలో మాదిగలకు ఒకటి కూడా ఇవ్వకుండా ద్రోహం చేసిన రేవంత్ రెడ్డి వైఖరికి నిరసనగా ఈనెల 13 వరకు నిరసన కార్యక్రమాలకు పిలుపునిస్తున్నట్లు పేర్కొన్నారు. రేపు అన్ని జిల్లాలలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయాల ముందు నల్లజెండాలతో నిరసన కార్యక్రమం ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల నాయకులతో నిర్వహిస్తున్నట్లు, యూనివర్సిటీలలో విద్యాసంస్థలలో మాదిగ విద్యార్థులతో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కార్యాచరణ ప్రకటించారు.
ఈ విలేకరుల సమావేశంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు డా. చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, మీర్రా హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టీవీ నరసింహ మాదిగ,ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సందే కార్తిక్ మాదిగ,రాష్ట్ర అధికార ప్రతినిధి
డా. కొమ్ము శేఖర్ మాదిగ,మీర్రా హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ మాదిగ ,ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి డా. పల్లెర్ల సుధాకర్ మాదిగ, ఎమ్మెస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జనపాల మహేష్ మాదిగ, ధవ శివప్రసాద్ మాదిగ , ఎడ్ల రుద్రి మాదిగ , చెరుకూరి సత్యనారాయణ మాదిగ, బొల్లు శ్రీనివాస్ మాదిగ , చెండేటి వేణుగోపాల్ మాదిగ, బాబురావు మాదిగ, చల్లగూడెం దేవేందర్ మాదిగ ,పాల్గొన్నారు.

## తిరుమల నడక యాత్ర చేపట్టిన కవిత

**- తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, రంగారెడ్డి**
**- జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి.**



**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 5:-**
ర్షచిస్ అవెన్యూ కోర్టులో కుట్రపూరిత కేసుల కొట్టివేత – న్యాయం గెలిచిన వేళ శ్రీవారి చెంతకు కవిత. నూతన రాజకీయ ప్రస్థానానికి సిద్ధమవుతున్న వేళ అలిపిరిలో ఘన స్వాగతం. తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుల ఆధ్వర్యంలో కాలినడకన తిరుమల పయనం తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ పై కేంద్ర దర్యాప్తు సంస్థలు కుట్రపూరితంగా మోపిన అక్రమ కేసులను ఢిల్లీలోని ర్షచిస్ అవెన్యూ న్యాయస్థానం కొట్టివేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని పాండురంగారెడ్డి అన్నారు. ఎటువంటి ఆధారాలు లేని, నిరాధారమైన ఆరోపణలతో పెట్టిన కేసులను న్యాయస్థానం క్లీన్ చిట్ ఇస్తూ తీర్పునివ్వడం సత్యానికి లభించిన విజయమని కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ చారిత్రాత్మక విజయానంతరం, తన మొక్కును తీర్చుకునేందుకు కవితమ్మ గారు నేడు తిరుపతి అలిపిరి నుంచి తిరుమల గిరులకు కాలినడక యాత్రను ప్రారంభించారు అని అన్నారు. అలిపిరి వద్ద నేతల ఘన స్వాగతం. న్యాయపోరాటంలో విజయం సాధించి, నూతన రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్న తరుణంలో అలిపిరి మెట్ల మార్గం వద్ద కవితమ్మ కి తెలంగాణ జాగృతి నేతలు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు సంపత్ గౌడ్, మేడ్చల్, మల్కాజ్గిరి అధ్యక్షుడు రామిడి వెంకట్ రెడ్డి,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు డి.వీరన్న స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో: తెలంగాణ జాగృతి నాయకులు చలసాని విష్ణుమూర్తి,కుమ్మరి శివశంకర్, ప్రకాశ్,ఉండెల బాబు రావు, శ్రీశైలం తదితర రంగారెడ్డి జిల్లా నాయకులు పాల్గొన్నారు. నూతన రాజకీయ దిశగా అడుగులు.. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ..”కవితమ్మ పై జరిగినది ముమ్మాటికీ రాజకీయ కుట్రేనని నేడు న్యాయస్థానం తీర్పుతో తేలిపోయింది. అగ్నిపరీక్షలో నెగ్గిన మేలిమి బంగారంలా కవితమ్మ బయటకు వచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజా సేవే లక్ష్యంగా ఏర్పాటు చేయబోయే నూతన రాజకీయ పార్టీకి శ్రీవారి ఆశీస్సులు ఉండాలని ఈ మొక్కుబడి యాత్ర చేపట్టినట్లు” తెలిపారు. భారీ అనుచర గణంతో అలిపిరి మెట్ల మార్గం ద్వారా నడక సాగించిన కవితమ్మ నేడు తిరుమల చేరుకున్నారు. రేపు (6వ తేదీన) ఉదయం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని. న్యాయ విజయం రాజకీయ భవిష్యత్తుపై భగవంతుని ఆశీస్సుల కోసం ఈ యాత్ర ప్రాధాన్యత సంతరించుకుందని పాండురంగారెడ్డి అన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

# తిరుమల తిరుపతి దేవస్థాన అధికారులు,సిబ్బంది రాజకీయ నేతలకు ఊడిగం చేస్తున్నారా??

**- బ్రాహ్మణ చైతన్య వేదికలి**

**- తెలంగాణ రాష్ట్ర మంత్రి ప్యాంటు చొక్కా మీద ప్రోటోకాల్ విఐపి దర్శనం చేసుకుంటే ఎలా అనుమతించారు...??**

**- తిరుమల తిరుపతి దేవస్థాన పవిత్ర నియమాలకు విరుద్ధంగా వ్యవహరించిన తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీవాసరెడ్డిని సాంప్రదాయ దుస్తుల్లో కాకుండా ప్యాంటు చొక్కాల మీద ఎలా అనుమతించారు... టిటిడి అధికారులు సమాధానం చెప్పాలి... సిరిపురం శ్రీధర్ శర్మ**



**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి తిరుపతి.**
ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర మంత్రి / గతంలో వైసిపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులతో తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ప్రోటోకాల్ దర్శనం సందర్భంగా ప్యాంటు చొక్కాలతో దర్శనం చేసుకుంటుంటే టిటిడి అధికారులు స్థానిక సిబ్బంది ఎలా అనుమతించారని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ టిటిడి అధికారులను ప్రశ్నించారు.. గుంటూరులో రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తిరుమల పవిత్ర నియమావళి ప్రకారం ప్రోటోకాల్ మరియు విఐపి దర్శనాల్లో వచ్చే భక్తులు, కుటుంబ సభ్యులు వీఐపీలు సాంప్రదాయ దుస్తుల్లోనే అనుమతించాలని ఒకపక్క నిబంధనలు చెప్తుంటే తిరుమల తిరుపతి నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణ రాష్ట్ర మంత్రి చాలెంజ్ విసిరితే పట్టించుకోకుండా, ఎటువంటి చర్యలు తీసుకోకుండా టీటీడీ అధికారులు సిబ్బంది ఎందుకు ఉన్నారని, టిటిడి నియమావళి ప్రకారం పురుషులకు డ్రెస్ కోడ్ ధోతీ లేదా పైజామా, పై వస్త్రం పురుషులు ధరించాలని,మహిళలకు ఇష్టపడే డ్రెస్ కోడ్ చీర లేదా హాఫ్-చీర, బ్లౌజ్ లేదా చురీదార్, పైజామా మరియు పై వస్త్రం మహిళలు ధరించాలని స్వయంగా టిటిడి నిబంధనలో ఉన్నదని, ఈ విషయం పట్ల కలియుగ ప్రత్యక్ష దైవం భక్తులు, నెటిజెన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే టిటిడి అధికారులు సిబ్బంది ఇలాంటి తప్పుడు చర్యల పట్ల భక్తులకు ఏం సందేశం ఇస్తున్నారని శ్రీధర్ టిటిడి అధికారులను ప్రశ్నించారు. రాజకీయ నాయకులతో పాటు అక్కడ పనిచేస్తున్న ప్రధాన అధికారులు సిబ్బంది తిరుమల వైభవాన్ని, ప్రతిష్టను మంట కలుపుతున్నారని దీనిపైన కూటమి ప్రభుత్వం, పాలకమండలి తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో భక్తులలో ఆగ్రహావేశాలు వచ్చే ప్రమాదం ఉన్నదని, ఒకపక్క కల్తీ లడ్డు విషయంలో అన్య మతాల వద్ద, స్వామివారి భక్తుల వద్ద తిరుమల వైభవాన్ని ప్రతిష్టను దిగజార్చారని, మాజీ ముఖ్యమంత్రి జగన్ ముఖ్య మంత్రిగా చేసిన సమయంలో డిక్లరేషన్ పుస్తకంలో సంతకాలు చేయకుండా స్వామివారి ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా దిగజార్చారని, వీటన్నిటికీ అధికారులు సిబ్బందిదే బాధ్యతని, అలాంటి బాధ్యత విస్మరించిన అధికారులను తక్షణమే నిబంధనల ప్రకారం,చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, కలియుగ ప్రత్యక్ష దైవం పట్ల భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా స్వామివారి కైంకర్యాలకు ప్రతిష్టకు అవమానాలు జరగకుండా, రాజకీయ జోక్యాలు రాజకీయ ఒత్తిడిలు, రాజకీయ పైరవీలు జరగకుండా టీటీడీని స్వయం ప్రతిపత్తి కొత్త చట్ట నిబంధనలు కోటమి ప్రభుత్వం తీసుకురావాలని, సనాతన ధర్మ సాంప్రదాయాలను టీటీడీలో కాపాడాలని శ్రీధర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జరిగిన ఘటన పైన అధికారులు, సిబ్బంది ఎంతటి వారైనా సరే కోటల ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో దేవుడంటే భక్తి భయము లేకుండా అధికారులు సిబ్బంది ప్రవర్తించే ఆస్కారం ఉన్నదని, అందువల్ల తక్షణమే కూ టమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని శ్రీధర్ విజ్ఞప్తి చేశారు.

# ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన నందున కలెక్టర్కు ఫిర్యాదు



**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 5:-** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం లో గురువారం రోజున జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, రంగారెడ్డి జిల్లాకి కలసి మున్సిపల్ ఎన్నికలు - 2026, ఎన్నికల నియమావళిని యదేచ్ఛగా ఉల్లంఘించిన స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిపై విచారణ, కేసు నమోదు చట్టపరమైన చర్యలకై ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పోలీస్ ఏ సి పి ల ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై తగు చర్యలకై వారిని విదులనుండి తప్పించటకై జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్ పార్టీ బృందం. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపీ పి కృపష్, జిల్లా యూత్ నాయకులు మంద సురేష్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బి ఆర్ ఎస్ విఅధ్యక్షులు నిట్టు జగదీశ్వర్, మున్సిపల్ అధ్యక్షులు కొప్పు జంగయ్య, మాజీ కౌన్సిల్లరు వనము శ్రీనివాస్,నారగిని సుధాకర్ గౌడ్, బి ఆర్ ఎస్ వి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అధ్యక్షులు మడుపు శివ సాయి, కాకి రవీందర్ ముదిరాజ్ ,నర్సిగల ప్రవీణ్,కాకి సంతిష్, మహీందర్ ముదిరాజ్, లక్ష్మణ్,నాని,జి,పవన్ గౌడ్,యాచారం సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేవుడి తర్వాత ప్రజలు వైద్యులనే నమ్ముతారు

**- ప్రభుత్వ ఆసుపత్రికి ఎప్పుడు వెళ్ళిన డాక్టర్ ఉంటారనే నమ్మకం ప్రజలకు కల్పించాలి.**

**- మంచి సేవలు అందించే ఆసుపత్రులకు, సిబ్బందికి ప్రత్యేక బహుమతులు.**





**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 5:-**
ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్యులు, సిబ్బందితో కలిసి 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగింది. ?తిరుమలాయపాలెం ఆసుపత్రి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ఈ ఏడాది డిసెంబర్ నాటికి అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదారును ఆదేశించడం జరిగింది. అదే వేదికగా లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులు అందజేయడం జరిగింది. తిరుమలాయపాలెంలో రూ. 26 కోట్లతో ఆసుపత్రి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగింది, ఒకప్పుడు కేవలం 30 బెడ్లతో, సరైన వసతులు లేక గిరిజన సోదరులు ప్రసవం కోసం, అత్యవసర చికిత్స కోసం ఖమ్మం వరకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఉండేది, ఆ కష్టాలను తీరుస్తూ, ఇప్పుడు జిల్లా ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోని విధంగా అధునాతన వైద్య పరికరాలు, డయాలసిస్ యూనిట్, పూర్తిస్థాయి ప్రసవ సౌకర్యాలను నూతనంగా నిర్మిస్తున్న 100 పడకాల ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వం ఎన్ని కోట్లు ఖర్చు చేసినా, ఎన్ని భవనాలు కట్టినా.. రోగికి నమ్మకం కలిగించేది వైద్యులు మాత్రమే, దేవుడి తర్వాత ప్రజలు వైద్యులనే నమ్ముతారు, అర్ధరాత్రి వచ్చినా వైద్యులు అందుబాటులో ఉంటారనే భరోసా పేద ప్రజలకు కలిగించేలా పని చేయాలని డాక్టర్లకు సూచించడం జరిగింది. చర్ల, మణుగూరు, ఇల్లెందు ఆసుపత్రుల్లో వైద్యులు ఇస్తున్న అద్భుతమైన సేవలను చూసి ఇతర మండలాల నుంచి కూడా రోగులు అక్కడికి వస్తున్నారని పేర్కొనడం జరిగింది. అదే స్ఫూర్తితో మన పాలేరు నియోజకవర్గంలోని ఆసుపత్రులు కూడా పని చేయాలని కోరడం జరిగింది. అదే విధంగా మంచి సేవలు అందించే ఆసుపత్రులకు, సిబ్బందికి ప్రత్యేక బహుమతులు అందించే కార్యక్రమాన్ని పాలేరు నియోజకవర్గం నుంచే ప్రారంభిస్తానని ప్రకటించడం జరిగింది. ?వైద్య సిబ్బంది తిరుమలాయపాలెంలో స్థానికంగా అందుబాటులో ఉండి ప్రజలకు సేవలను అందించి వారిలో నమ్మకాన్ని, ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల భద్రతా భావాన్ని కల్పించాలని స్పష్టం చేయడం జరిగింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం.. పేదల విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తోంది. వైద్యులు స్థానికంగా అందుబాటులో ఉండి ప్రజలకు ఏ సమయంలోనైనా వైద్యం లభిస్తుందనే నమ్మకం కల్పించినప్పుడే ప్రభుత్వ అసలైన లక్ష్యం నెరవేరుతుంది.

# వేం నరేందర్ రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 5**
గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో రాజ్యసభ కాంగ్రెస్ అభ్యర్థి వేం నరేందర్ రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డికి మంత్రి పొంగులేటి శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారుడు కే కేశవ రావుతో కలిసి నామినేషన్ పత్రాలను సంబంధించిన అధికారులకు అందజేశారు.

# మాజీ ఎమ్మెల్యే బల్క సుమన్ పరామర్శించిన కేటీఆర్



**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 5:-** కాంగ్రెస్ సర్కార్ బనాయించిన అక్రమ కేసుల్లో అరెస్టు లపై16 రోజుల జైలుజీవితం అనంతరం బెయిల్పై విడుదలైన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్కు ఘన స్వాగతం లభించింది. ఇటీవల నమోదైన కేసులో ఆయనను పోలీసులు అరెస్టు చేయగా, కోర్టు ఆదేశాల మేరకు 16 రోజుల పాటు జైలులో ఉన్నారు. అనంతరం న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంతో విడుదలయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ను కలిసిన బాల్క సుమన్, కేసు పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయనకు మద్దతుగా నిలిచి, ఇది రాజకీయ ప్రేరేపిత కేసు అని ఆరోపించారు. బాల్క సుమన్ విడుదలతో ఆయన అనుచరులు ఆనందం వ్యక్తం చేస్తూ, న్యాయం సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ ఘటనపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.

# పోలీసుల్లో కన్నీళ్లు కఠినత్వం రెండూ ఉన్నాయి...!

సమాజంలో ప్రజల బాధలు చూసి కన్నీరు కార్చే పోలీసులు ఉన్నారు.అదే పేదవాళ్లు తమ హక్కుల గురించి అడిగితే కర్రలు, లాఠీలు వాడి ఇరుచుకుపడే పోలీసులు కూడా ఉన్నారు. సమాజంలో పోలీసు అనగానే ఒకరమైన భయం,భక్తి మిశ్రమంగా కనిపించడం సహజం.కానీ,ఆ భయాన్ని తగ్గించి,ప్రజలకు 'స్నేహితులు'గా మారాలనే ప్రజల ఆకాంక్షల మేరకు తెలంగాణ పోలీసు శాఖ 2014 నుంచి 'ఫ్రెండ్లీ పోలీసింగ్' నినాదంతో అనేక కార్యక్రమాలు చేపట్టింది.ఆ కార్యక్రమాలు ఏమి సాధించాయి? ప్రజలలో భయం తగ్గిందా? లేదా కేవలం స్లోగన్ లుగానే మిగిలాయా? అనేది మరోసారి రివ్యూ చేసుకుంటే అర్థమవుతుంది. 'ఫ్రెండ్లీ' అనే పేరుతో వచ్చిన కార్యక్రమాలు తెలంగాణ పోలీసు అధికారులు తమ విజన్లోనే "ఓపెన్,ఫ్రెండ్లీ, కమ్యూనిటీ మైండెడ్" అని పేర్కొన్నారు.దీనికి అనుగుణంగా మహిళల భద్రతకు 2014లో హైదరాబాద్లో ప్రారంభమైన షీ టీమ్స్ వ్యవస్థ రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది.వేలాది ఫిర్యాదులు స్వీకరించి,హరాస్మెంట్ కేసుల్లో త్వరిత చర్యలు తీసుకుందని, మహిళలు,యువతుల్లో పోలీసులపై నమ్మకం పెరిగిందని పోలీస్ శాఖ అధికారులు చెబుతున్నారు.ఇందులో భాగంగా చైల్డ్ ఫ్రెండ్లీ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశారు.2019 లో మెదిపల్లి (రాచకొండ)లో మొదటి స్టేషన్ బొమ్మలు, బుక్స్తో పిల్లలు భయపడకుండా ఫిర్యాదు చేసేలా ఏర్పాటు చేశారు.ఇప్పుడు అనేక స్టేషన్లలో ఇలాంటి మోడల్ ఉండేలా చర్యలు చేపట్టారు.ఇదే తరహాలో భరోసా సెంటర్లు,డోర్స్టెప్ ఎఫ్ఐఆర్ కూడా ప్రారంభించారు.ఇంటి వద్దే ఫిర్యాదు నమోదు,మానసిక సహాయంతో 2025 లో కొత్తగా ప్రారంభమైన ఈ వ్యవస్థ ప్రజలను స్టేషన్కు రాకుండా సహాయపడుతోంది.అంతేకాకుండా టూరిస్ట్ పోలీస్,ట్రాన్స్జెండర్ ట్రాఫిక్ పోలీస్ తో సమాజంలో సమానత్వ సందేశం ఇచ్చాయి. ఇక కమ్యూనిటీ పోలీసింగ్ ఆపరేషన్ లో భాగంగా చాబుత్రా, జాబ్ కనెక్ట్,కమ్యూనిటీ సీసీటీవీ వంటి కార్యక్రమాలు యువత, మహిళలు,పెద్దలతో సంబంధాలు పెంచాయి.అయితే 2025 అక్టోబర్లో తెలంగాణ డీజీపీ బి.శివధర్ రెడ్డి "ఫెయిర్, ఫర్మ్,ఫ్రెండ్లీ అండ్ ప్రొఫెషనల్ పోలీసింగ్" అనే నాలుగు అంశాలను ప్రకటించారు."ఫ్రెండ్లీ అంటే ప్రజల నమ్మకం పెంచడం" అని స్పష్టం చేశారు.ఇండియా జస్టిస్ రిపోర్ట్లో తెలంగాణ పోలీసు కొన్ని పారామీటర్లలో టాప్లో నిలిచింది.కానీ,నిజం ఏమిటంటే క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరుగా ఉంది."ఫ్రెండ్లీ పోలీసింగ్కు" పోలీస్ డిపార్ట్మెంట్ ప్రయత్నాలు చేస్తోంది.కానీ,ఫీల్డ్ లెవల్ సిబ్బంది ఇంకా అలవాటు చేసుకోలేదు.కస్టడీ మరణాలు, ఆదివాసి,దళిత యువకులపై దాడులు,పేదలపై అనవసర లాఠీ చార్జ్లు ఇప్పటికీ కొనసాగుతున్నాయి."ఫ్రెండ్లీ పోలీస్ అని కాలర్ ట్యూన్ పెట్టుకుని,ఫ్రెండ్లి ప్రజలపై లాఠీలు వాడతారా?" అనే ప్రశ్నలు ఇప్పటికీ వినిపిస్తూనే ఉన్నాయి.ఇక ప్రతిపక్ష నాయకులు,కార్యకర్తలపై వేధింపులు,రైతులు,కూలీలపై అనవసర దాడులు,వల్గర్ లాంగ్వేజ్ వంటివి 'ఫ్రెండ్లీ' ఇమేజ్ను దెబ్బతీస్తున్నాయి. దీనితో పేదలు,బలహీన వర్గాలు ఇంకా "పోలీసు అంటే భయం" అనే భావనతోనే ఉన్నారు. ఒకవైపు పోలీసు అధికారి ప్రజల బాధలకు కన్నీరు కార్చిన వీడియోలు వైరల్ అవుతుంటే, మరోవైపు అదే పోలీసు పేదవాడిని కొట్టిన ఫిర్యాదులు వస్తున్నాయి.ఫ్రెండ్లీ పోలీసింగ్ ఫలితం ఏమిటి?ఫ్రెండ్లీ పోలీస్ కార్యక్రమాలు కొన్ని వర్గాల్లో (మహిళలు,పిల్లలు, యువత) నమ్మకం పెంచాయి, నేరాలు కొన్ని వర్గాల్లో తగ్గాయి. కానీ,సామాన్యుడు,పేదవాడి జీవితంలో పెద్ద మార్పు రాలేదు. ఫీల్డ్ లెవల్ శిక్షణ, జవాబుదారీతనం,రాజకీయ జోక్యం తొలగించకపోతే ఫ్రెండ్లి పోలీసింగ్ అనేవి స్లోగన్లు మాత్రమే మిగులుతాయి.డీజీపీ, సీఎం రేవంత్ రెడ్డి "ఫ్రెండ్లీ అంటే ఫర్మ్ కూడా" అని చెబుతున్నారు. కానీ,ఆ 'ఫర్మ్' పేదలు, బలహీనులపైనే పడకూడదు. పోలీసు సేవా భావనతో పనిచేస్తేనే నిజమైన 'ఫ్రెండ్లీ పోలీస్' అవుతుంది.లేకపోతే భయం-భక్తి కాకుండా,కేవలం 'భయం' మాత్రమే మిగులుతుంది.ఇది కేవలం ఒక రిపోర్ట్ కాదు,ప్రజల్లో నెలకొన్న ఆకాంక్షగా చూడాలి.పోలీసు శాఖ ఇంకా ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా,క్షేత్ర స్థాయిలో కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకు ఒకే భావనతో మేము "ప్రజల సేవకులం" అని భావించినప్పుడే నిజమైన మార్పు వస్తుంది. లేకపోతే కన్నీరు కార్చే పోలీసులు,కర్రలు వాడే పోలీసులు అనే రెండు ముఖాలు ఎప్పటికీ పోలీస్ శాఖలో కొనసాగుతూనే ఉంటాయి.



**??గంట సోమన్న,సీనియర్ జర్నలిస్ట్.**

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# కొమ్మాల గుట్టపై అగ్నిప్రమాదం

**వాలంటీర్ల సాహసంతో తప్పిన పేను ప్రమాదం**






**హైద్రాబాద్ ఎస్టేట్ న్యూస్/వరంగల్ ప్రతినిధి ప్రకాష్ :** **గీసుకొండ, వరంగల్ జిల్లా:** ప్రసిద్ధ కొమ్మాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి గుట్ట వద్ద గురువారం అగ్నిప్రమాదం సంభవించి కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. జాతర సందర్భంగా గుట్ట పరిసరాల్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. అయితే జాతరకు సేవలందిస్తున్న వాలంటీర్లు వెంటనే అప్రమత్తమై ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మంటలను అదుపులోకి తెచ్చేందుకు ముందుకు వచ్చారు. బకెట్లలో నీటిని తీసుకువచ్చి మంటలపై పోస్తూ అగ్నిని ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. సమాచారం అందుకున్న వెంటనే ఎమ్మార్వో, ఎస్సై కుమార్, ఫైర్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం అగ్నిని పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ముఖ్యంగా బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్ వాలంటీర్లు కీలక పాత్ర పోషించారు. వారి తక్షణ స్పందనతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ జాతర సమయంలో భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వాలంటీర్లు చూపిన సేవాభావం, చాకచక్యం ప్రశంసనీయమని పేర్కొన్నారు. భక్తులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

## నా భార్య గర్భిణి సార్ అని వేడుకున్నా మెడలు పట్టుకొని బయటకు వెళ్లగొట్టారు : మూసీ బాధితుడు



**హైదరాబాద్ :** కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న పనులతో గత రెండు సంవత్సరాల నుంచి మాకు నిద్రపట్టడం లేదంటూ మూసీ బాధితుడు ఆందోళన వ్యక్తం చేశాడు. గత కేసీఆర్ ప్రభుత్వంలో మూసీ సుందరీకరణలో భాగంగా నిర్మించిన నాగోల్ బ్రిడ్జిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, సుధీర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ వాణి దేవి ఇతర నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సదరు మూసీ బాధితుడు మాట్లాడుతూ.. నాకు తెలిసినప్పుడు నా భార్య 9 నెలల గర్భిణీ. అప్పటి నుంచి నాకు సరిగా నిద్రపట్టడం లేదు. అప్పుడు కూడా నా భార్య ప్రెగ్నెంట్. ఇప్పుడు కాదు.. మా ఇల్లు మేం కష్టపడి కట్టుకున్నం అంటే లేదు.. మీరిక్కడ ఉంటరా.. బయటకు వెళ్లిపోతరా.. మీ ఇల్లు కూల్చేస్తమన్నారు. ప్రెగ్నెంట్ అని చెప్పిన కూడా మమ్మల్ని రూమ్‌ల్లో పెట్టి తాళం వేసి బయటకు రాకుండా చేసి.. మీరు లోపే ఉండండి.. లేదంటే మూసీ పేరు మీద మీ ఇల్లు కూలగొట్టేస్తమని అన్నరు. అప్పుడు సుధీర్ అన్న మా దగ్గరకు వచ్చి మాకు భరోసా ఇచ్చిండు. మమ్మల్ని ఆదుకుంటా అని చెప్పిండు అంటూ కన్నీరు పెట్టుకున్నాడు. నా భార్య గర్భిణి సార్ అని వేడుకున్నా కూడా ఇల్లు కూల్చేస్తామని అన్నారు. అధికారులు నన్ను మెడలు పట్టుకొని బయటకు వెళ్లగొట్టారు. సొంత ఇల్లును కూల్చేస్తామని అంటే గర్భిణీ అయిన నా భార్యను కిరాయి ఇంట్లో పెట్టిన. అన్ని అనుమతులు ఉన్నా కూడా నా ఇంటిని కూల్చేస్తామని అన్నారు. అందుకే పెట్రోల్ పోసుకున్నానంటూ కేటీఆర్ దగ్గర మూసీ బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు.

# హైదరాబాద్‌లో భారీగా కల్తీ నెయ్యి పట్టివేత నిందితుడు అరెస్టు



**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో కల్తీనెయ్యి కలకలం రేపింది. కల్తీ నెయ్యి విలువ సుమారు రూ.18 లక్షలు ఉంటుందని సమాచారం. మొత్తం 460 కిలోల కల్తీ నెయ్యి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో నిందితుడు జునైద్ హుస్సేన్‌ను అరెస్టు చేశారు.నెయ్యిలా వాసన వచ్చేందుకు : నగరంలో కల్తీ నెయ్యి తయారు చేస్తున్న స్థావరంలో బుధవారం హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోదాలు నిర్వహించారు. పామాయిల్, మీగడ, ప్రమాదకరమైన రసాయనాలతో తయారు చేసిన 460 కిలోల నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు జునైద్ హుస్సేన్ (26)ను అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్ భోలానగర్‌కు చెందిన జునైద్ ఫ్రైడ్ డెయిరీ పేరుతో అనుమతి తీసుకొని ఇంటినే అడ్డాగా మార్చుకున్నజునైద్ హుస్సేన్, గేదె, ఆవు, పాల నుంచి మీగడ సేకరించి దానిలో పామాయిల్, వనస్పతిలను, ఇతర రసాయనాలతో దీనిని తయారు చేస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. నెయ్యిలా వాసన వచ్చేందుకు రసాయనాలను ఉపయోగించేవాడు. వీటిని ప్యాకెట్లుగా మార్చి నాణ్యమైన నెయ్యిగా చెబుతూ తక్కువ ధరకు శుభకార్యాలకు, హోటళ్లకు భారీ ఎత్తున విక్రయించేవాడు.కల్తీ నెయ్యి, తయారీ యంత్రాలు సీజ్ : కొద్దినెలలుగా సాగుతున్న ఈ కల్తీపై టాస్క్‌ఫోర్స్ డీసీపీ అందె శ్రీనివాసరావుకు సమాచారం అందింది. ఆయన నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్, ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు విజయానంద్, చందన, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. రూ.18.26 లక్షల విలువైన 460 కిలోల కల్తీ నెయ్యి, 70 కేజీల కల్తీ మిశ్రమం, సుమారు 3,260 కేజీల మీగడ, 28 డబ్బాల వనస్పతిని స్వాధీనం చేసుకున్న పోలీసులు కల్తీ నెయ్యి, తయారీ యంత్రాలు సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఇంట్లో వాడే నెయ్యి నాణ్యమైనదో లేదో కొన్ని పద్ధతుల ద్వారా తెలుసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. నెయ్యి స్వచ్ఛతను నిర్ధారించేందుకు స్టవ్?పై ఉంచి వేడిచేస్తే సువాసన వచ్చినట్లయితే అది నాణ్యమైన నెయ్యి అని అర్థం. స్వచ్ఛమైన నెయ్యి వేడిచేస్తే అంతగా పొగరాదు. కల్తీది అయితే మాత్రం పొగ ఎక్కువగా వస్తుంది. కాలిన వాసన వస్తుంది. ఇలా వచ్చిందంటే ఆ నెయ్యిలో ఏదైనా పదార్థాలు కలిపినట్లుగా అర్థం చేసుకోవాలి.నెయ్యి స్వచ్ఛతను పరీక్షించేందుకు ఓ గ్లాసు గోరువెచ్చని నీటిని తీసుకోవాలి. అందులో కొంత నెయ్యి వేసి బాగా కలపాలి. నాణ్యమైన నెయ్యి అయితే ఆ ద్రావణంలో పూర్తిగా కరిగిపోతుంది. కల్తీ నెయ్యి అయితే మాత్రం నీటిపై తేలిపోయి విడిపోయినట్లుగా ఉంటుంది. మలినాలు కనిపిస్తాయి.పైన వివరించిన రెండు పద్ధుతులే కాకుండా మరికొన్ని విధాలుగా కూడా నెయ్యి నాణ్యతను పరీక్షించవచ్చు. ఇందుకోసం తెల్లటి గుడ్డపై కొద్ది పరిమాణంలో నెయ్యిను వేయండి. కొన్ని సమయం పాటు అలా ఉంచండి. నాణ్యమైన నెయ్యి అయితే అది ఎండిపోయిన తర్వాత మరకలు లాంటివి ఏవీ కనిపించవు. ఒక వేళ గుడ్డపై ఏవైనా అవశేషాలు, మరకలు లాంటివి కనిపించినా అది కల్తీ అయ్యిందని తెలుసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# ఒకట్రెండు రోజుల్లో లొంగిపోనున్న మావోయిస్టులు జాబితాలో 100 మందికిపైగా



**కరీంనగర్ జిల్లా :** సాయుధ మావోయిస్టులు పెద్ద సంఖ్యలో ఒకట్రెండు రోజుల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందు లొంగిపోనున్నారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఇది అతి పెద్ద లొంగుబాటు కానుందని సమాచారం. 100 మందికి పైగా మావోయిస్టులు జనజీవనస్రవంతిలో కలవనుండగా వారిలో పీఎల్?జీఏ కేడర్‌తో పాటు అగ్రనేతల అంగరక్షకులు కూడా ఉన్నట్లు తెలుసో_ంది.దాదాపు వంద మందికి పైగా సాయుధులు పోలీసులు సమక్షంలో జనజీవన స్రవంతిలో కలవడంతో పాటు 60కి పైగా ఆయుధాలను అప్ప గించనున్నట్లు సమాచారం. 2002 లో ఉమ్మడి రాష్ట్రంలో జనశక్తి కరీంనగర్ జిల్లా కార్యదర్శి రణధీర్ నేతృత్వంలో 46 మంది నక్సలైట్లు లొంగిపోవడమే ఇప్పటివరకు ఉన్న రికార్డు. గతంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పదుల సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయినా వారంతా మిలిటెంట్లు, సానుభూతిపరులు మాత్రమే ప్రస్తుతం లొంగిపోనున్నది. మావోయిస్టు పార్టీలో కీలకమైన మిలిటరీ శిక్షణ పొందిన పీఎల్?జీఏ కేడరే కావడంతో ప్రాధాన్యం సంతరించుకొంది.ఇటీవలే మావోయిస్టు సెంట్రల్ మిలిటరీ కమిషన్ కార్యదర్శి తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీతో పాటు అగ్రనేతలు మల్లా రాజిరెడ్డి ఎలియాస్ సంగ్రామ్, బడే చొక్కారావు ఎలియాస్ దామోదర్, నూనె నర్సింహారెడ్డి ఎలియాస్ గంగన్నల లొంగుబాటు ద్వారా మావోయిస్టు కార్యకలాపాల నియంత్రణలో పట్టు నిరూపించుకున్న తెలంగాణ పోలీసులు తాజాగా జరగనున్న లొంగుబాటుతో తమదైన ముద్రను సొంతం చేసుకోనున్నారు. లొంగిపోనున్న సాయుధ మావోయిస్టుల్లో పై నలుగురు అగ్రనేతలకు అంగరక్షకులుగా వ్యవహరించిన సాయుధులతో పాటు కీలకమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కేడర్ ఉన్నారు. తెలంగాణ, చత్తీస్‌గఢ్ రాష్ట్ర కమిటీ సౌత్‌బస్తర్ కమిటీలకు నేతృత్వం వహించిన వారూ ఉన్నారు. వీరిలో సింహభాగం చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందినవారే ఉన్నారు.ఆపరేషన్ కగార్ ఉద్ధృతమైన నేపథ్యంలో 2024 ఆగస్టులో మావోయిస్టు పార్టీ అగ్ర నేతలు గణపతి, బస్వరాజ్, దేవీ సహా అందుబాటులో ఉన్న కేంద్రకమిటీ సభ్యులు సమావేశమై కీలక తీర్మానం చేసుకున్నారు. చత్తీస్‌గఢ్ అడవుల్లో ఉన్న మావోయిస్టు కేడర్ అర్బన్ షెల్టర్లకు వెళ్లి తలదాచుకోవాలని నిర్ణయించుకున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విధించిన 2026 మార్చి 31 డెడ్లైన్ గడువు ముగిసిన తర్వాత దండకారణ్యానికి తిరిగి వచ్చి తదుపరి కార్యాచరణపై సమీక్షించుకోవాలనే నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే పలువురు మావోయిస్టులు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి తలదాచుకున్నారు. అనంతర పరిణామాల్లో అక్కడి పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.మరోవైపు తెలంగాణాలోని ములుగు, ఆసిఫాబాద్ అడవుల్లోనూ పలువురు మావోయిస్టులు రోజుల తరబడి మకాం వేశారు. ఈ నేపథ్యంలో కొద్దిరోజుల క్రితం ఆసిఫాబాద్ అడవుల్లో 20మందికి పైగా మావోయిస్టుల కదలికలు గుర్తించిన నిఘావర్గాలు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. గ్రేహౌండ్స్ దళాలతో కలిసి కూంబింగ్ చేసిన క్రమంలో.. మావోయిస్టుల ఆచూకీ లభించడంతో గంటల పాటు సంప్రదింపులు జరిపిన అనంతరం వారిని లొంగిపోయేలా చేశారు. తాజాగా వారి లొంగుబాటు చూపించనున్నట్లు తెలిసింది. 591 మంది మావోయిస్టులు : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సమావేశం అయ్యారు.

# పంచాయతీల్లో కొత్త సర్పంచ్ పాత సర్పంచ్ పెండింగ్ బిల్లులపై లొల్లి రంగంలోకి మంత్రి సీతక్క




**హైదరాబాద్ :** తెలంగాణలో దాదాపు 2 ఏళ్ల ఆలస్యంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. జనవరి నెలలోనే గ్రామాల్లో కొత్త పాలక వర్గాలు ఏర్పడి.. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లతో పా లన సాగుతోంది. తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆలస్యం చేయడంతో.. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయకుండా పెండింగ్‌లో ఉంచింది. ఎన్ని కలు పూర్తి అయిన తర్వాత మాత్రమే వాటిని రిలీజ్ చేస్తామని తేల్చి చెప్పింది. దీంతో ఇటీవల ఎన్నికలు పూర్తై గ్రామాల్లో కొత్త సర్పంచ్‌లు వచ్చిన తర్వాత.. దశల వారీగా 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం విడుదల చేస్తోంది. అదే సమయంలో గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులను కేటాయిస్తోంది. ఇక్కడే ఇప్పుడు అసలు సమస్య మొదలైంది.పలు విడతల్లో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు సుమారు రూ. 1,034 కోట్ల నిధులను ఇటీవలె విడుదల చేసింది. ఇప్పుడు ఈ నిధుల గురిం చే.. కొత్త సర్పంచ్‌లు, పాత సర్పంచ్‌లకు మధ్య తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. తాము గతంలో సర్పంచ్ హోదాలో గ్రామాల్లో చేపట్టిన మౌలిక సదుపాయాలు కల్పించామని.. వైకుంఠధామాలు, డ్రైనేజీలు, క్రీడా ప్రాంగణాలు వంటి అభివృద్ధి పనులు చేసినట్లు పాత సర్పంచులు చెబుతున్నారు. ఆ పనులకు అప్పట్లో బిల్లులు రాకపోవడంతో తీసుకొచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుపోతున్నాయని పాత సర్పంచ్‌లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.1,000 కోట్లకు పైగా పాత బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం విడుదలైన నిధులపై తమకే హక్కు ఉంటుందని తేల్చి చెబుతున్నారు. ఇక.. కొత్త సర్పంచ్‌లు మాత్రం వాటికి ససేమిరా అనడంతో అసలు వివాదం మొదలైంది. తాము పంచాయతీ ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి, గ్రామాలను డెవలప్ చేస్తామని ప్రజలకు మాట ఇచ్చామని.. ఇప్పటివరకు వచ్చిన నిధులు మొత్తాన్ని పాత బకాయిలకే చెల్లిస్తే.. ఇక గ్రామాల్లో అభివృద్ధి ఎలా చేయాలంటూ ప్రశ్నిస్తున్నారు.తాము అధికారంలోకి వచ్చీ రాగానే.. కేంద్రం నుంచి విడుదలైన నిధులను ఇవ్వకపోతే.. ఇక గ్రామ పంచాయతీలను ఎలా నడపాలంటూ ప్రశ్నిస్తున్నారు. చకుండా కేవలం పెండింగ్ బకాయిలు తీర్చడానికే తాము కొత్తగా పదవుల్లోకి వచ్చామా అంటూ కొత్త సర్పంచ్‌లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.పెండింగ్ నిధుల్లో కేంద్రం కొంత మాత్రమే విడుదల చేయడం.. నిధుల విషయంలో కొత్త, పాత సర్పంచ్‌ల విషయంలో ఈ ఉద్రిక్తత తలెత్తడంతో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పందించారు. గతంలో గ్రామాల్లో చేపట్టిన తాగునీరు, పారిశుద్ధ్య పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను.. తాజాగా విడుదలైన నిధుల నుంచి చెల్లించాలని మంత్రి సీతక్క స్పష్టం చేసింది. అదే సమయంలో పంచాయతీల్లో అందుబాటులో ఉన్న నిధుల్లో నుంచి గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని సూచించారు.

# మావోయిస్టు అగ్రనేత గణపతి స్వగ్రామంలో టెన్షన్



**బీర్‌పూర్(జగిత్యాల):** మావోయిస్టు అగ్రనేత గణపతి స్వగ్రామం బీర్‌పూర్ బుధవారం రాత్రి టెన్షన్ వాతావరణం నెలకొంది. మావోయిస్టు అగ్రనేత ఢిల్లీలో లొంగిపోతున్నాడని వార్తలు రావడంతో గ్రామంలో ఒకేసారిగా టెన్షన్ వాతావరణం నెలకొంది. గ్రామంలోని వృద్ధులు, యువకులు, మహిళలు ఆసక్తితో టీవీల వద్ద కూర్చొని ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. ఉపా ధ్యాయుడిగా ఉండి ఉద్యమాల్లోకి వెళ్లిన గణపతి ఇప్పుడు ఎలా ఉన్నాడో చూడాలనే ఆత్రుతతో బీర్ పూర్ ప్రజలు ఎదురుచూస్తున్నారు.లొంగిపోవాలని గతంలోనే 'అంతర్మథనం'ముపాల లక్ష్మన్‌రావ్ అలియాస్ గణపతి లొంగిపోవాలని 2013లో బీర్‌పూర్ గ్రామంలో అప్పటి ఎస్పీ శివకుమార్ ఆధ్వ ర్యంలో అంతర్మథనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసం దర్భంగా గ్రామంలో ఎస్పీ శివకుమార్ బస చేశారు. వేదికపై గణపతి లొంగిపోవాలని జనస్రవంతిలో కలవాలని ఎస్పీ ఆహ్వానించారు.

# హైదరాబాద్‌లో ఘోర ప్రమాదం.. భవనంపై నుంచి పడి ముగ్గురు మృతి.



**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని టోలీచౌక్ ప్రాంతంలో గురువారం ఒక ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఒక భవనంపై పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి నలుగురు భవన నిర్మాణ కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. భవనం ఐదో అంతస్తులో పనులు చేస్తున్న సమయంలో అదుపు తప్పి కింద పడటమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.ఈ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు వదలగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన వారిని చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి అత్యవసర చికిత్స అందు తోంది. మృతుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని సమాచారం.నిర్మాణ రంగంలో తగిన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికులు ఎంతో ఎత్తులో పనిచేసేటప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఇలాంటి ప్రాణనష్టం సంభవిస్తోంది. ఈ

## తెలంగాణ మహిళలకు సర్కార్ శుభవార్త.. ఉచితంగా 30 రకాల వైద్య పరీక్షలు, ఫ్రీ హెల్త్ చెకప్‌లు



**హైదరాబాద్ :** తెలంగాణలో మహిళా శక్తికి ఆరోగ్య భరోసా కల్పించేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ కీలక కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో తయారు చేసిన హెల్త్ మిషన్-100 (100 రోజుల ఆరోగ్య మిషన్) కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళల దినోత్సవాన్ని పురస్కరించుకుని.. ఆ రోజు నుంచి ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈ హెల్త్ మిషన్-100లో భాగంగా ప్రధానంగా మహిళలు, పిల్లలు, వృద్ధుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వనున్నారు. మహిళా దినోత్సవం నాడు ప్రత్యేకంగా మహిళలకు హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలను ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశారు.మరీ ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద మహిళలు పడే ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం.. వారికి ఎలాంటి ఖర్చు లేకుండా అత్యాధునిక డయాగ్నోస్టిక్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని రేవంత్ రెడ్డి సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. కాగా ఈ వైద్య పరీక్షలను వచ్చే 6 నెలల పాటు కొనసాగించనున్నట్లు వైద్యారోగ్య శాఖ అధికారులు తెలిపారు.రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలు, డ్వాక్రా మహిళలే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. సెర్ప్ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ఉన్న సుమారు 42 లక్షల నుంచి 46 లక్షల మంది మహిళలకు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి కల్పించనున్నారు. ప్రతి మహిళకు టీ-డయాగ్నస్టిక్స్ నెట్‌వర్క్ ద్వారా దాదాపు 30 రకాల ముఖ్యమైన మెడికల్ టెస్ట్‌లను ప్రభుత్వం ఫ్రీగా చేయనుంది. కేవలం సాధారణ వైద్య పరీక్షలకే పరిమితం కాకుండా.. మహిళలకు వచ్చే ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధిని ముందుగానే గుర్తించేందుకు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లను కూడా ఈ మెడికల్ టెస్టుల్లో చేర్చారు. ఈ మొత్తం స్క్రీనింగ్ ప్రక్రియను 4 దశల్లో విభజించి.. రానున్న 6 నెలల కాలంలో పూర్తి చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

Printed, Published & Owned by BATTU LAXMI NARAYANA ; Printed at BATTU PRINTERS, PLOT NO 30 .ROAD NO 2. MADHRA NAGAR. MANSURABAD .LBNAGAR R R DIST., TELANGANA, Published from BATTU.PUBLICATIONS, H.NO PLOT NO 30 .ROAD NO 2. MADHRA NAGAR. MANSURABAD .LBNAGAR, R R DIST. Editor: BATTU LAXMI NARAYANA, CELL:9951693876